# నిశి

మహర్షి గరికపాటి



ఆనందరావు హడావిడిగా ఇంట్లోకొచ్చి, కాళ్ళ కడ్డం వచ్చిన టీపాయ్‌ని ఫెడేల్‌మని తన్ని బోర్లా వ డేటప్పటికి వంటింట్లోవున్న భార్య గబాలునా బయటకు వచ్చి " ఆ దిక్కుమాలిన టి.వి. వార్తల కోసం ఇంట్లో వస్తువులన్నీ తన్ని తగలేస్తున్నారు. మీకంటే పిల్లలే నయం. " రుస రుస లాడింది. ఆనందరావు ఆనందం హరించుకుపోగా బుర్ర గోక్కుంటూ " నాకేం తగల్లేదు కదా! హి...హి... " అంటూ లేచి టి.వి. ఆన్ చేశాడు.

అప్పుడే వార్తలు ప్రారంభం అయ్యాయి. టివి స్క్రీన్ మీద న్యూస్ రీడర్ ప్రత్యక్షమవ్వగానే ఆనం దరావు భార్యకు చిరెత్తుకొచ్చి టివి వ్యాల్యూమ్ తగ్గించి విసవిసా వంటింట్లోకి వెళ్ళిపోయింది.

టివి న్యూస్‌రీడర్ కళ్ళు అటూ ఇటూ తిప్పి " వార్తలు చదువుతున్నది దివ్యవాణి. ఈ రోజు వార్తల్లోని ముఖ్యాంశాలు చెప్పేముందు నాలుగు వ్యాపార ప్రకటనలు " అనేటప్పటికి దిగాలుగా ఆనందరావు కుర్చీలో వెనక్కి జరిగి కూలబ డ్డాడు.

అంతలోనే ఆనందరావు భార్య టీ తీసుకుని వచ్చి టివి వైపు భర్త వైపు ఒక సారి చూసి టీపాయ్ మీద కప్పు దభామని పెట్టి ఒక ముక్కు ముక్కి వెళ్ళి పోయింది.

మళ్ళీ ఎనౌన్సర్ ప్రత్యక్షమయింది. ఆమె కళ్ళ వెంట నీరు కారుతున్నది. " ఈ రోజు ఓ లారీ బస్సు గుద్దుకుని 50 మంది మరణించారు. వారి చావుకు అనేక మంది తమ సంతాపం తెలియజే శారు." వెంటనే కళ్ళు తుడుచుకుని " అంగార గ్రహం పై తిరుగుతున్న ఉపగ్రహం దారి మరచి పోయి గోల చేస్తున్నట్టు అధికార భోగట్టా. కాసేపు వ్యాపార ప్రకటనలు." అనేటప్పటికి ఆనందరావు ఓ నిట్టూర్పు విడిచాడు. అంతలో అతని భార్య బయటకు వచ్చి " ఇష్టమైతే వార్తలు చూడండి, లేకపోతే లేదు. అంతేగాని నిట్టూర్పులు పడ్డారంటే నాకు చికాకు పుట్టుకొస్తుంది. ఆపై ఏంచేస్తానో నాకే తెలియదు.హు..."చాకాకు పడి కాళీ కప్పు అందుకుని లోపలికి వెళ్ళిపోయింది.

టివిలో ఎనౌన్సర్ మళ్ళీ భయంగా కళ్ళు తిప్పుతూ "నగరంలో ప్రతి రాత్రి డ్రాకులా దొరికినవారిని చంపుతూ తింటున్న సంగతి మీకు తెలిసిందే. కానీ గత రెండు రోజులుగా దానికి మనుషులు దొరకక ఆకలి భరించలేక వీధి కుక్కల రక్తం పీల్చుకుంటున్నదని అధికార వార్తలందాయి. తమ డిపార్ట్‌మెంట్ చేయలేని పని డ్రాకులా చేస్తున్నదని తెలిసిన మునిసిపాలిటి అధికారులు చప్పడయ్యేలా చంకలు గుద్దుకుని ఆనందపడిపోతూ మనుషులె వరు డ్రాకులాకు దొరకకుండా తమకు సహాయప డాలని కోరారు. డ్రాకులా స్వచ్ఛందంగా లొంగిపోతే పునరావాసం ఏర్పాటు చేయగలమని అలవాటు ప్రకారం ప్రకటించారు.సాయంత్రం ఎనిదయ్యేస రికి రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారుతున్నాయి. ఓరి నాయనో రాత్రయితే నేనెలా ఇంటికి వెళ్ళాలా దేవుడో ...." కంగారు పడింది న్యూస్ రీడర్.

ఆనందరావు నెత్తిన టపీటపీమని బాదుకుంటుం డగా భార్య ఇంట్లోంచి బయటకు వచ్చి మిరి మిరి చూసి " ఆ కొట్టుడు కార్యక్రమం నాకే వదిలితే ఎంత ఆనందంచే దానినో " అంది సంబరపడిపోతూ.

** ** ** **

అర్ధరాత్రి పన్నెండు గంటలు. నిశ్శబ్దమైన వాతా వరణం డ్రాకులా ఆకలితో ఓ కేక పెట్టింది. దాని అరువుకు చెట్లమీద పక్షులు భయంతో గోల చేసాయి. దాని కళ్ళు చీకట్లో చింత నిప్పుల్లా మెరు స్తున్నాయి. అది ఒక సారి బద్ధకంగా లేచి వళ్ళు విదిల్చుకొని మెల్లగా నడవసాగింది. ఆ నిశ్శబ్దమైన వాతావర్ణంలో దాని అడుగుల శబ్దం భయం గొల్పుతోంది. ఆహారం కోసం దాని కళ్ళు అదే పని గా వెదుకుతున్నాయి.

కొంతసేపు నడక సాగిన తరువాత దాని కళ్ళకు దూరంగా ఓ లైటు చీకట్లో మినుకు మినుకు మంటూ కనిపించింది. దాంతో దానికి ఆనందం కట్టలు తెచ్చుకున్నది. వెంటనే ఒక్కసారిగా ఆవ లించింది. దాని ఆవలింత శబ్దానికి చెట్ల మీద పక్షులు తమ పిల్లల్ని రెక్కల చాటున పొదుము కుని బితుకుబితుకుమని చీకట్లోనికి చూస్తున్నాయి. దూరంగా ఎక్కడో కుక్క అరువులు వినిపి స్తున్నాయి. అంతా చీకటే అయినప్పటికీ డ్రాకులా అలవాటుగా నడుచుకుంటూ ఆ లైటు వైపు నడుస్తున్నది. ఆ లైటు దగ్గర అవుతున్నకొద్దీ దానిలో ఆకలి, ఆత్రుత ఎక్కువవుతున్నాయి. అది వడివడిగా ఆ లైటును సమీపించింది. నాలుగు వీది కుక్కలు భౌమని అరుస్తూ కాలి సత్తువ కొద్దీ పరిగెత్తుతున్నాయి. అంతే ఆ వీధిలో కరెంట్ పోయింది. డ్రాకులా ఒక్కసారి సింహనాధం చేసింది. ఆ అరువుకు చుట్టుపక్కల వారు వులిక్కిపడి నిద్రలేచారు. ఆ శబ్దం ఏమిటో అర్థం కాలేదు. డ్రాకులా మళ్ళీ పెద్దగా గ్రాండ్రు పెట్టింది. బాధతో గిలగిలలాడునట్లుగా వుంది. చీకట్లో ఏమీ కనిపించడం లేదు. చుట్టుపక్కల ఇళ్ళలో గుస గుసలు వినిపిస్తున్నాయి. కాని డ్రాకులా మాత్రం ఒండ్ర ఆపలేదు. దాని బాధ వర్ణనాతీతంగా వుంది. అరువులు భయంకరంగా వున్నాయి. ఆ అరువు లకు భయపడ్డ పక్షులు చీకట్లోకి వెళ్ళిపోతున్నాయి. ఆ ప్రాంతమంతా సందడిగా మారిపోయింది. అలా అరుస్తున్న డ్రాకులా అయిదు నిమిషాలకు మూలుగు కూడా ఆగిపోయింది.. ఆ వీధిలో కరెంట్ వచ్చింది. అందరి ఇళ్ళలో లైట్లు వెలిగాయి. కాని ఎవరు బయటికి వచ్చే సాహసం చేయలేదు.

డ్రాకులా జీవచ్ఛవంలా పడివుంది. అది ఒక బ్లడ్‌బ్యాంక్. బ్లడ్‌బ్యాంక్‌లోంచి ఒక వైపు డ్రాకు లాను చుట్టి రక్తం పీల్చి బ్యాంక్‌లోనికి సరఫరా చేస్తున్నది.